నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 23 జూలై 2024 | YADADRI BHUVANAGIRI

25న చేనేత పరిరక్షణ మహా ర్యాలీ

భూదాన్ పోచంపల్లి, జూలై 22 : భూదాన్ పోచంపల్లి పట్టణంలో చేనేత పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 10:30 గంటలకు నేతన్న విగ్రహం నుంచి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు చేనేత పరిరక్షణ మహా ర్యాలీ నిర్వహించనున్నట్లు చేనేత టై అండ్ డై సిల్క్ చీరెల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మిల్లు యజమానులు ఉత్పత్తి చేస్తున్న డూప్లికేట్ టై అండ్ డై చీరెలు, వస్త్రాలు, అమ్మకాలు చేస్తున్న షాపింగ్ మాల్స్ యజమానులకు వ్యతిరేకంగా చేనేత పరిరక్షణ మహా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేనేత డిజైన్లను కాపీ చేస్తూ మిల్లు యజమానులు ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలను బహిరంగ మార్కెట్లోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేసి ప్రపంచ మార్కెట్లో ప్రత్యేకతను నిలబెట్టుకుందామన్నారు. చేనేత పరిశ్రమ మనుగుడ కోసం చేనేత వస్త్ర వ్యాపారులు, చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు, సంఘం సభ్యులు, చేనేత అభిమానులు మహా ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సూర్యాపేట కలెక్టరేట్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మళ్లీ దొంగల భయం

జిల్లాలో రెచ్చిపోతున్న దోపిడీ ముఠాలు

- వేసవిలో చైన్ స్నాచింగ్ గ్యాంగ్ బీభత్సం
- ముఠా అరెస్ట్‌తో కొంత కాలం గ్యాప్
- మళ్లీ రోజుకో చోట దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు
- బస్సులు, బస్టాండ్లలో పర్సులు, సెల్‌ఫోన్లు, బైక్‌లు చోరీ
- చాలా చోట్ల పనిచేయని సీసీ కెమెరాలు
- నిందితుల గుర్తింపు, సొత్తు రికవరీ అంతంతే..
- పోలీసులకు సవాల్‌గా మారిన వరుస ఘటనలు

జిల్లాలో దొంగలు మళ్లీ బీభత్సం సృష్టిస్తున్నారు. నిత్యం చోరీలు, దొంగతనాలతో రెచ్చిపోతున్నారు. రోజుకో ఊరిలో దొంగతనాలు చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. వేసవిలో వరుస చైన్‌స్నాచింగ్, దొంగతనాలు జరగ్గా, ఓ ముఠా అరెస్ట్‌తో మధ్యలో గ్యాప్ వచ్చింది. ఇప్పుడు దొంగలు మళ్లీ తడాఖా చూపిస్తున్నారు. బస్సులు, బస్టాండ్లలో పర్సులు, సెల్‌ఫోన్లు, బైక్‌లు అపహరిస్తున్నారు. నిందితుల గుర్తింపు, సొత్తు రికవరీ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. నాన్‌స్టాప్ ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి.

– యాదాద్రి భువనగిరి, జూలై 22 (నమస్తే తెలంగాణ)

నిత్యం ఏదో ఒక చోట..

బీఆర్ఎస్ హయాంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. ఎక్కడా దొంగతనాలు, చైన్‌స్నాచర్లు పెద్దగా కనిపించేవి కాదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో క్రైం రేట్ పెరుగుతూ వస్తున్నది. గత ఆరు నెలలుగా దొంగతనాలు, చోరీల్లో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తున్నది. వేసవిలో వరుసగా చైన్ స్నాచర్లు జరిగాయి. ఆరు బయట పడుకున్నా, మిద్దె మీద నిద్రించినా, ఇంట్లో ఉన్నా పెద్ద ఎత్తున దొంగతనాలు జరిగాయి. దీంతో పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా గస్తీ కాశారు. ఆఖరికి ఓ ముఠాను పట్టుకుని అరెస్ట్ చేశారు. దాంతో కొన్ని రోజులుగా దొంగతనాలు పెద్దగా కనిపించలేదు. కానీ ఇటీవల మళ్లీ దొంగలు చెలరేగిపోతున్నారు. సెల్ షాపులు, మూసి ఉన్న దుకాణాలు, ఇండ్లు టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నారు.

బస్సులు, బస్టాండ్లలో ఎక్కువగా..

బస్టాండ్లలో సైతం యథేచ్ఛగా చోరీలు జరుగుతున్నాయి. బస్సులు రద్దీగా ఉంటుండటంతో దొంగలు తమ పనిని సులువుగా కానిచ్చేస్తున్నారు. బస్సుల్లో పర్సులు, సెల్‌ఫోన్లు కొట్టేస్తున్నారు. బాధితులు మాత్రం ఫిర్యాదులు చేయకుండా వదిలేస్తున్నారు. ఈ తరహా చోరీలు ఇటీవల పెరుగడం ఆందోళన కలిగిస్తున్నది. ముఖ్యంగా భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ బస్టాండ్లలో పదుల సంఖ్యలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు బైక్‌లు సైతం మాయమవుతున్నాయి.

నిందితుల గుర్తింపు, రికవరీ అంతంతే..

వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. దొంగలు పోలీసులకు దొరక్కుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో నెలలు దాటుతున్నా గుర్తించలేకపోతున్నారు. దీంతో పోయిన సొత్తు, బంగారం రికవరీ కావడంలేదు.

భువనగిరిలో పనిచేయని సీసీ కెమెరాలు

భువనగిరి మున్సిపాలిటీలో వందల సంఖ్యలో సీసీ కెమెరాలు ఉన్నాయి. సీసీ కెమెరాలు అమర్చుకోవాలని పోలీసులు పదేపదే సూచిస్తున్నారు. కానీ అనేక చోట్ల సీసీ కెమెరాలు ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని ఒకటి, రెండు కాలనీల్లో మినహా ఎక్కడా పనిచేయడంలేదని తెలుస్తున్నది. దీని పర్యవేక్షణ కూడా గాలికి వదిలేశారు. మున్సిపాలిటీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి జోక్యంతో సీసీ కెమెరాల కాంట్రాక్టు ముందుకు సాగుడం లేదనే ప్రచారం జరుగుతున్నది.

ఇటీవలి ఘటనలు

- ఈ నెల 21న అర్ధరాత్రి భువనగిరి పట్టణంలోని టచ్ మొబైల్ షాపులో చోరీ జరిగింది. 30 లక్షల విలువైన సెల్‌ఫోన్, నగదు ఎత్తుకెళ్లారు.
- 19న భువనగిరి పట్టణంలోని లక్ష్మి జ్యువెల్లర్స్‌లో పట్టర్ విరగ్గొట్టి.. బంగారం, వెండిని దొంగిలించారు.
- 16న తెల్లవారుజామున యాదగిరిగుట్ట పట్టణంలో ఒకే రోజు ముగ్గురి ఇంట్లో చోరీ జరిగింది. 12 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.లక్ష వరకు నగదు అపహరించారు.
- 15న బీబీనగర్ మండలంలో ఇంటికి తాళం వేసి ఉన్న రెండు ఇండ్లలో దొంగతనానికి పాల్పడారు. ఈ ఘటనలో రూ.15వేల నగదు, 15తులాల బంగారం చోరీకి గురైంది.
- జూలై రెండో వారంలో భువనగిరి మండలంలోని ఏడుగురు రైతుల కరెంట్ బాక్స్‌లు దొంగతనం చేశారు.
- ఈ నెల 5న చౌటుప్పల్ మండలంలోని దేవులమ్మ నాగారంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి బంగారం, నగదు అపహరించారు.
- జూన్ 22న చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం పరిధిలో రాత్రి సమయంలో ఆగి ఉన్న కారులో నుంచి రూ.1.48లక్షల దారి దోపిడీ జరిగింది.
- మే చివరి వారంలో పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామ శివారులో తాళవేసిన ఇంట్లో చోరీ జరిగింది.

భువనగిరిలో రెండు సెల్‌ఫోన్ షాపుల్లో చోరీ

భువనగిరి అర్బన్ : పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని టచ్ సెల్‌ఫోన్, ఎస్‌వీ మొబైల్ షాపుల యాజమానులు ఆదివారం రాత్రి దుకాణానికి తాళం వేసి వెళ్లారు. సోమవారం ఉదయం యజమానులు వచ్చి చూసే సరికి షటర్ తాళం పగులగొట్టి ఉన్నది. టచ్ సెల్‌ఫోన్ షాపులో రూ.30లక్షలు, ఎస్‌వీ మొబైల్ షాపులో రూ.2లక్షల విలువగల ఫోన్లు, రూ.10వేల నగదును అపహరించుకపోయినట్లు నిర్వాహకులు తెలిపారు. షటర్‌ను గునపంతో పైకి తీసి షాపులోకి చొరబడ్డట్లు, ముగ్గురు వ్యక్తులు ముఖానికి మాస్కులు ధరించి, గోనె సంచిలో సెల్‌ఫోన్లు వేసుకుని ఎత్తుకెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయ్యింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు.

భువనగిరిలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో ఆదివారం రాత్రి మాస్క్‌తో దొంగతనానికి వచ్చిన వ్యక్తి సీసీ ఫుటేజీలో రికార్డ్ అయిన దృశ్యం

ఆడబిడ్డల ఆత్మగౌరవం పెంచిన ఘనత కేసీఆర్‌దే

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అందులో భాగమే..
- కేసీఆర్ ముందు చూపుతో పెట్టిన సంక్షేమ పథకాలే అందరికీ అండగా నిలిచాయి
- కాంగ్రెస్ వస్తే తులం బంగారం అదనంగా వస్తదని ఆశపడ్డారు
- ఇన్ని రోజులు ఆలస్యమైతే నిజమేనని నమ్మినం
- చివరికి కేసీఆర్ తెచ్చిందే అమలు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- 407 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

సూర్యాపేట టౌన్/ఆత్మకూర్.ఎస్, జూలై 22 : పోరాడి రాష్ట్రాన్ని సాధించి అధికారం చేపట్టిన 2014 నుంచి 2023 వరకు సుమారు పదేండ్ల పాలనలో అన్ని రంగాల అభివృద్ధిపాటు ఆడబిడ్డల ఆత్మగౌరవం పెంచిన ఘనత బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అందులో భాగమేనని, అంతే కాకుండా అత్యధికంగా సంక్షేమ పథకాలు మహిళల పేరిట అందించిన ఘనత కూడా ఆయనదేనని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఆయన 407 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆత్మకూర్.ఎస్, పెన్‌పహాడ్ ఎంపీడీఓ కార్యాలయాల తర్వాత సూర్యాపేట కలెక్టరేట్ జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ సమయంలో అందరి కష్టాలు తెలుసుకున్న కేసీఆర్ సమాజంలో ఆడపిల్లలు కుటుంబానికి భారం కాకూడదని భావించి వారిపేరు మీద అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, నేడు అవే అందరికీ అండగా నిలుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ వస్తే కేసీఆర్ ఇస్తున్న రూ.లక్షతోపాటు మరో తులం బంగారం అదనంగా వస్తదని ఆశపడి ప్రజలకు వారికి అధికారం ఇచ్చారని, కానీ ఇప్పుడు వారికి ఎందుకు ఓటు వేశామా అని బాధపడుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు అందించడం ఇన్ని రోజులు ఆలస్యమైతే తాము కూడా నిజమేనని నమ్మామని, కానీ నేడు అక్కాచెల్లెళ్ల ఆశలు అడియాశలయ్యాయని, చివరికి కేసీఆర్ తెచ్చిందే అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పథకాల అమలుతో పాటు 6 గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, ఆర్డీఓ వేణు మాధవరావు, తాసీల్దార్లు వినోద్‌కుమార్, మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓలు ఎండీ హసీం, వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ తాసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్లు కొణతం సత్యనారాయణరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, ఆర్ఐ రమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెసోళ్లకు లేదు

- స్పెక్ట్రా బాధితుల విషయంలో ఎమ్మెల్యే బీర్ల స్పందించాలి
- త్వరలో బాధితులతో ధర్నా
- కాంగ్రెస్ కార్యకర్తల్లా పోలీసుల వ్యవహారం
- బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, జూలై 22 : ఉద్యమ నేత, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శిస్తే స్థాయి కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడికీ లేదని బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. లక్కీలాటరీలో ఎమ్మెల్యే అయిన బీర్ల అయిలయ్య కేటీఆర్‌ను విమర్శించడంపై హాస్యాస్పదంగా ఉందన్నారు. బీర్ల అయిలయ్య ఖబడ్దార్ అని హెచ్చరించారు. యాదగిరి గుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఒక్కనాడైనా జై తెలంగాణ అని ఉచ్చరించని బీర్ల అయిలయ్య ఉద్యమ నేత కేసీఆర్‌ను నిందించడం సిగ్గు చేటన్నారు. రేవంత్‌రెడ్డికి సీఎం హోదా, బీర్ల అయిలయ్యకు ఎమ్మెల్యే హోదా వచ్చిందంటే అది కేసీఆర్ పుణ్యమేనని తెలిపారు. రూ. 1200 కోట్లు వెచ్చించి యాదగిరిగుట్టను కేసీఆర్ పునర్నిర్మిస్తే బీర్ల అయిలయ్య ఇప్పుడొచ్చి రూ. కోట్ల అభివృద్ధి పనులను తమ బంధువులను అప్పగించిన సంగతి పట్టణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు గడుస్తున్నా గుట్టకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణమని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి కొండపైకి వచ్చి ఒక్క రూపాయి ప్రకటించలేదన్నారు. స్పెక్ట్రా వెంచర్ యాజమాన్యంతో కుమ్మక్కై బీర్ల అయిలయ్య చేసిన అక్రమాలు త్వరలో బయటకు తీస్తామని తెలిపారు. ఎంతో మంది అమాయకులు స్పెక్ట్రా వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేసి, అవి ఎక్కడున్నాయో దొరుకక తీవ్ర ఇబ్బందు పడుతున్నారని గుర్తు చేశారు. చాలా మంది బాధితులు స్పెక్ట్రా వెంచర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నారని, త్వరలో స్పెక్ట్రా వెంచర్ బాధితులతో కలిసి పట్టణంలో ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా పోలీసు అధికారులు వ్యవహరిస్తున్నాని ధ్వజమెత్తారు. లాజ్జీ ఓనర్లను పిలిపించి కాంగ్రెస్ పార్టీలో చేరాలని పోలీసు అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద అక్రమ కట్టడాలను అడ్డుకున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై పోలీసులు ప్రయోగించిన థర్డ్ డిగ్రీపై పోలీసులను సస్పెండ్ చేయాలని కోరితే ఎలాంటి స్పందన లేదన్నారు. వారిపై చర్యలు తీసుకునే వరకూ ఊరుకునేది లేదని తెలిపారు. యాదగిరిగుట్టకు కేటాయించిన మెడికల్ కళాశాల భువనగిరికి తరలివెళ్తుంటే ఎమ్మెల్యే బీర్ల చూస్తూ ఏ చేస్తున్నాడో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, రైతుబంధు సమితి మాజీ డైరెక్టర్లు మిట్ట వెంకటయ్య, పేరబోయిన సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ బాబా, నాయకులు చిత్తర్ల బాలయ్య, ఆరె శ్రీధర్‌గౌడ్, కల్వకొలను సతీశ్‌భట్, కన్న రాజు, తాళ్ల రాజేశ్వర్‌రెడ్డి, చిరంజీవి, నిమ్మనగోటి మల్లేశ్, ఆకుల రాజశేఖర్, బిట్టు వెంకటేశ్, మధుకర్, హజీజ్, గోపాల్ పాల్గొన్నారు.

మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూలై 22 : వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందిని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. వన మహోత్సవంలో పెద్దఎత్తున మొక్కలు నాటాలన్నారు . గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయించిన 11 లక్షల 28 వేల మొక్కలకు గానూ ఇప్పటి వరకు 4 లక్షల 77 వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున సమయం వృథా కాకుండా మిగతా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. నాటిన ప్రతి మొక్క బతికే విధంగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని, జియో ట్యాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులు తరచూ మొక్కల పెరుగుదల, సంరక్షణపై తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్ పాల్గొన్నారు.

డీఎస్సీకి మూడో రోజు 349 మంది హాజరు

రామగిరి, జూలై 22 : నల్లగొండలోని ఎస్‌పీఆర్ పాఠశాల ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో సోమవారం మూడో రోజు జరిగిన డీఎస్సీ పరీక్షలకు 349 మంది అభ్యర్థులు హాజరు కాగా 21 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ఎస్‌జీటీ పరీక్షకు 185 మందికిగానూ 174మంది, మధ్యాహ్నం జరిగిన స్కూల్ అసిస్టెంట్ గణితం పరీక్షకు 185 మందికిగానూ 175 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నీలంరెడ్డి వెల్లడించారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- భువనగిరిలో విద్యార్థుల రాస్తారోకో

భువనగిరి అర్బన్, జూలై 22 : పెండింగ్‌లో ఉన్న రూ.7వేల కోట్ల విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మోదీరాందేవ్ డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణంలో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రిన్స్ చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీ, రాస్తారోకోలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించకుండా విద్యకు దూరం చేస్తుందన్నారు. 100 రోజుల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 100 రోజుల్లో రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ విగ్రహాలు ఏర్పాటు తప్ప రాష్ట్ర ప్రజల బతుకులు ఏమీ మారలేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కొఠారి కమిషన్ ఆధారంగా విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఊరూరు తిరిగి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే వారినే నిలువునా ముంచుతున్నదన్నారు. మెగా డీఎస్సీలో 25వేల ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రూప్ 1, 2, 3, పోస్టులు పెంచాలని కోరారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలులేవని, వెంటనే విద్యార్థుల ఇబ్బందులను తీర్చాలని అన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎదుగకుండా ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎడ్ల మహాలింగం, మణికంఠ గౌడ్, వట్టెం మధు, నితీశ్, మహేశ్, నవీన్, సిద్దు, ఆకాశ్, సతీశ్, రమేశ్, శ్రీకాంత్, మనోజ్, ఓంప్రకాశ్, బింగి దీపక్, రమాదేవి, మానస, సుప్రియ, ప్రియాంక పాల్గొన్నారు.

ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని భువనగిరిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

కొనసాగుతున్న బదిలీలు

- జూనియర్ అసిస్టెంట్ నుంచి జిల్లా అధికారుల వరకు..

యాదాద్రి భువనగిరి, జూలై 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఉద్యోగుల బదిలీల పర్వం కొనసాగుతున్నది. జూనియర్ అసిస్టెంట్ నుంచి జిల్లా అధికారుల వరకు స్థానం చలనం నడుస్తున్నది. సాధారణ బదిలీల్లో భాగంగా అనేక మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయగా మరికొందరికి రావాల్సి ఉంది. సాధారణ బదిలీల్లో భాగంగా 22 శాఖలకు సంబంధించి 320మంది జూనియర్ అసిస్టెంట్, ఆ దిగువ స్థాయి ఉద్యోగులు, సిబ్బందిని బదిలీ చేశారు. జిల్లా ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి బదిలీపై హైదరాబాద్ వెళ్లగా, ఆయన స్థానంలో పి.రవీందర్ ఇక్కడికి వచ్చారు. డీఎంహెచ్‌ఓ పుల్లారావు రంగారెడ్డికి బదిలీ కాగా, మెదక్‌లో పనిచేసిన మనోహర్ ఇక్కడికి రానున్నారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన రాజారావు జిల్లా కేంద్రం దవాఖాన సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న చిన్నానాయక్ ఆలేరు, రామన్నపేట, చౌటుప్పల్ డీసీహెచ్‌గా కొనసాగనున్నారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రమేశ్ రెడ్డి వచ్చారు. వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు కూడా వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న మందడి ఉపేందర్ రెడ్డిని హైదరాబాద్ కలెక్టరేట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రామ్మూర్తి మేడ్చల్‌కు వెళ్లారు. ఎన్నికల సూపరింటెండెంట్ నాగేశ్వరచారి జనగామకు బదిలీ అయ్యారు. మేడ్చల్‌లో అడిషన్ పీఆర్వోగా పనిచేస్తున్న అరుంధతి యాదాద్రికి బదిలీపై రానున్నారు.

హామీలను అమలు చేయాలి

- వేతనం రూ.18 వేలకు పెంచాలి.. అన్ని బెనిఫిట్స్ కల్పించాలి
- కలెక్టరేట్ వద్ద ఆశ కార్యకర్తల ధర్నా

భువనగిరి కలెక్టరేట్, జూలై 22 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం మాట్లాడుతూ ఈ బడ్జెట్ సమావేశాల్లోనే పెరిగిన ధరలకు అనుగుణంగా ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలు అమలు చేయాలన్నారు. ఇన్యూరెన్స్ రూ. 50లక్షలు ఇవ్వాలని, 20 రోజులు క్యాజువల్ సెలవులు ఇవ్వాలని, 6నెలల వేతనంతో కూడిన మెడికల్ లీవ్స్, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. గత మూడు సంవత్సరాలుగా యూనిఫామ్ ఇవ్వడం లేదని, 20సంవత్సరాలుగా పని చేస్తున్న ఆశ వర్కర్లను పరీక్షల పేరుతో తొలగించాలని కేంద్రం కుట్రలు చేస్తున్నదని చెప్పారు. అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కసగొని లలిత, జిల్లా ఉపాధ్యక్షురాలు రంగ సంతోష, జిల్లా కోశాధికారి పుష్ప, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, నాయకులు పల్లెపాటి జ్యోతి, జమున, కల్పన, పావని, సుజాత, హైమావతి, ధనమ్మ, కమలమ్మ, ఇస్తారమ్మ, సులోచన, కృష్ణవేణి, లలిత, భారతమ్మ, హేమలత, మహేందర్, విజయలక్ష్మి, రేణుక, ఉమారాణి, ఆండాలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు